ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 12 జనవరి 2025 | 5



సంక్రాంతి సందడి వచ్చేసింది.. బంధుగణంతో కొత్త కళ తెచ్చేసింది..నగరాల్లో ప్రధాన మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి.. వస్త్ర దుకాణాలు.. నగల దుకాణాలకు జనం భారీగా క్యూకడుతున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పట్టణాల్లో ప్రధాన మార్కెట్లు ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోతున్నాయి..ఇక షాపింగ్ మాల్స్ సంగతి అయితే చెప్పనవసరంలేదు.గత వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉండగా.. పండుగ దగ్గరపడడంతో ఈ రద్దీ పెరిగింది. ఈ చిత్రమే చూడండి..రాజమహేంద్రవరం ప్రధాన మార్కెట్ శనివారమెలా కిక్కిరిసిపోయిందో..!

షాపింగ్..సందడి



సంక్రాంతికి వస్తున్నాం

పల్లెకు పండగొచ్చింది





రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్‌లో బ్యాగ్‌లతో ప్రయాణికులు..

గోదావరి జిల్లాల ఆప్యాయత.. అనురాగాలు.. ప్రేమకు తిరుగులేదు.. కాలం మారినా అదే తీరు.. గోదావరి నీటిలోనే ఆ ప్రేమ ఇమిడి ఉందో ఏమిటో తెలియదు కానీ.. గత పది రోజులుగా ప్రతి ఇంట్లోనూ పండుగకు ఎప్పుడొస్తున్నారు.. ఎప్పుడొస్తున్నారు.. అనే మాటకు అలుపే లేదు.. అంత ఆప్యాయంగా పిలిస్తే ఎందుకురారు.. సంక్రాంతికి వస్తున్నాం.. అంటూ బంధువులు వచ్చేస్తున్నారు.. అటు హైదరాబాద్ ఇటు వైజాగ్ నుంచి దారులన్నీ గోదావరి జిల్లాల వైపే చూపిస్తున్నాయి.. రైళ్లు ఫుల్ అయిపోతున్నాయి.. బస్‌ల సంగతి సరే సరి.. విమానాలదీ అదే పరిస్థితి.. కార్లు.. ద్విచక్ర వాహనాలపై వచ్చే వారి సంఖ్య తక్కువేం లేదు.. రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి.. గోదావరి జిల్లాల్లోని పల్లెలబాట పడుతున్నాయి..

- దారులన్నీ ఇటువైపే
- ప్రధాన నగరాల నుంచి రాక
- తరలివస్తున్న బంధుగణం
- బస్‌లు..రైళ్లు..విమానాలు ఫుల్
- కళకళలాడుతున్న పల్లెలు
- సొంత వాహనాలే ఆధారం
- హైవేలపై ట్రాఫిక్‌జామ్‌లు
- గోదావరి జిల్లాల్లో సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి వచ్చిందంటే గోదావరి జిల్లాల్లో సందడే వేరు.. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కుటుంబాలతో పండుగకు వస్తారు.. పట్టణం నుంచి పల్లెబాట పడతారు.ఉమ్మడి జిల్లాల నుంచి లక్షలాదిమంది బెంగళూరు, పుణే, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే ఎక్కువ. శుక్రవారం పని ముగించుకుని శని, ఆదివారం సెలవు కావడంతో పండుగకు బయలుదేరిపోయారు. శనివారం అర్ధరాత్రి నుంచే గోదావరి జిల్లాల రోడ్లకు తాకిడి పెరిగింది. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, మధురపూడి ఎయిర్‌పోర్ట్ కిటకిటలాడిపోతున్నాయి. ప్రయాణికుల సంఖ్య గతంకంటే పెరిగింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కొద్దినెలల కిందట కేవలం 1300 మంది వరకూ రాకపోకలు సాగిస్తే.. ప్రస్తుతం రోజూ 2 వేలమంది రాకపోకలు సాగిస్తున్నారు. కొద్ది రోజుల కిందట 80 శాతం నుంచి 95 శాతం వరకూ ఆక్యుపెన్సీ ఉండగా ప్రస్తుతం ఫుల్ అయిపోతున్నాయి. ముంబై, ఢిల్లీ నుంచి వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఇక ఆర్టీసీలో సాధారణ రోజుల్లో 25 వేలమంది వరకూ ప్రయాణిస్తుంటే ప్రస్తుతం 50 వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. స్వగ్రామాలకు చేరుతున్న విద్యార్థులు, ప్రజలతో బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. కాకినాడ నగరంతోపాటు రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, జగ్గంపేట, ఏలేశ్వరం, రావులపాలెం బస్టాండ్లలో సందడి కనిపించింది. రైళ్లలో ప్రతి రోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటే.. ఆయా రైల్వే స్టేషన్లన్నీ ఊపిరాడనంతగా కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లకు సంక్రాంతి పండుగ ప్రయాణికుల తాకిడి విపరీతంగా ఉందని చెబుతున్నారు.



జాతీయ రహదారులు కిటకిట

కార్పొరేషన్(కాకినాడ)/నల్లజర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై సంక్రాంతి సందడి మొదలైంది. వరుస సెలవులు కావడంతో పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాలకు బయలుదేరిన వారితో శుక్ర, శనివారాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. విశాఖపట్నం నుంచి విజయవాడ 16వ నెంబర్ జాతీయరహదారి, కత్తిపూడి నుంచి పామర్రు 216వ నెంబరు హైవేపై వాహనాల రద్దీ కనిపిస్తోంది. ఈ రద్దీ తిరుగు ప్రయాణికులతో ఈనెల 19వ తేదీ వరకు కొనసాగనుంది.

200 బస్‌లు ఫుల్..

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. పండుగ ముందు, తర్వాత కూడా వందశాతం బుకింగ్ పూర్తయింది. శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు బస్సులేవీ ఖాళీ లేకపోవడంతో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణీకుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సంక్రాంతి ప్రయాణాలకు ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరికే పరిస్థితి లేకుండాపోయింది. హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే ప్రయాణీకులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు సుమారు 200 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మరిన్ని స్పెషల్స్ నడిపేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే తిరుగు ప్రయాణం కూడా కష్టంగా ఉండబోతుంది. ఈనెల 16 నుంచి 19 వరకు సీటు దొరికే పరిస్థితి లేదు. తిరుగు ప్రయాణాలు చేసుకునే వారికి 20వ తేదీ నుంచి మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయి.

రద్దీ ఎక్కువగా ఉంటే.. స్కూల్ బస్‌లు తిప్పేయండి..



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11: పండుగ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీలు, ఆర్టీసీ డీపీటీవో, డీటీసీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళుతున్న ప్రయాణికులకు సరిపడా బస్సు సౌకర్యాల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటిచోట్ల తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు సరిపోకపోతే ప్రైవేట్ కాలేజీ, స్కూల్ బస్సులను ఉపయోగించాలని సూచించారు.

- డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

పండుగకు రావాలనే.. కంగారొద్దు!

పండుగకు స్వగ్రామాలకు రావాలనే కంగారొద్దు..

జాగ్రత్తగా రండి.. లేదంటే ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.. వచ్చీరాని డ్రైవింగ్‌తో ఇంత రద్దీ సమయంలో దూర ప్రయాణం కష్టమే.. అందుకే ఆలోచించి నిర్ణయం తీసుకోండి.. లేదంటే ప్రమాదాలు జరగొచ్చు..పండుగ నేపథ్యంలో చాలా మంది బెంగళూరు, హైదరాబాద్, పుణె.. తదితర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. ఇలా వచ్చే వారి కారులో తప్పనిసరిగా ఇద్దరు డ్రైవింగ్ వచ్చిన వారు ఉండాల్సిందే.. ఎందుకంటే ఒకరు నిద్రపోయినా మరొకరు డ్రైవింగ్ చేయొచ్చు. లేదా నిద్ర వస్తే రహదారి పక్కన కాసేపు నిలిపివేసి నిద్రపోండి. ఎంత ఆనందంగా వస్తున్నారో అంతే భద్రంగా తిరిగెళ్లాలి సుమా..!

ఒక్క క్షణంలో.. ఘోరం!

- అన్నవరం దైవదర్శనానికి వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు
- కాకినాడ జిల్లా కత్తిపూడి జాతీయ రహదారిపై ఘటన

7



ప్రమాద దృశ్యం

తగ్గేదేలే!

పోలీస్ వర్సెస్ పందెగాళ్లు



- గ్రామాల్లో పందేల బరులు సిద్ధం
- కుదరదంటున్న పోలీస్ శాఖ
- నాయకుల నుంచి గ్రీన్‌సిగ్నల్
- నాలుగు గ్రామాలకో బరి
- ఒక చోట బరి రూ.16 లక్షలు
- గుండాటకు రూ.10 లక్షలు
- ఏర్పాట్లలో నిర్వాహకులు
- మరో పక్క పోలీసుల దాడులు
- ఇంకనూ పట్టువీడని పోలీస్
- భయపడని పందెగాళ్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కోడీ.. పోలీస్ దొంగాట మళ్లీ మొదలైంది.. ఒకరు ఆడనివ్వమంటుంటే.. పందెగాళ్లు మాత్రం వారి ఏర్పాట్లలో వారున్నారు.. ప్రజలంతా సంక్రాంతి సందడిలో ఉంటే.. మరో పక్క కోడిపందేల బరులు రూ.లక్షలతో సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ కోడిపందేల బరులు సిద్ధం అయ్యాయి. పోలీసులు ప్రతి ఏటా సంక్రాంతి ఆరంభంలో కోడిపందేలు ఆడనిచ్చేదిలేదని హెచ్చరికలు జారీ చేయడం, తర్వాత నెమ్మదిగా లాఠీలు దించేసి మౌనం వహించడం షరా మామూలే. ఈ ఏడాది కూడా పరిస్థితి అలాగే కనిపిస్తుంది. ఎందుకంటే జిల్లాలో ప్రజాప్రతినిధులు కోడిపందేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.ముఖ్య ప్రజాప్రతినిధులు కార్యకర్తల వరకూ అనుమతులిచ్చి వారు మాత్రం లావాదేవీలకు దూరంగా ఉంటే, ఒక ఎమ్మెల్యే మీఇష్టానుసారం కోడిపందాలు, గుండాటలు ఆడుకోండి..నాది నాకు పంపించండి అంటూ పార్టీ వర్గాలతో చెప్పడం పెద్ద చర్చనీయాంశమైంది.రాజానగరం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో పందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో నాలుగైదు ఊళ్ల ఒక ట్రెండు బరులను సిద్ధం చేస్తున్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని ఒక నియోజకవర్గంలో ఒక గ్రామంలో బరికి రూ.16 లక్షలు వేలం వెళ్లింది. మరో నియోజకవర్గంలో ఒక గ్రామంలో గతంలో మూడు గ్రూపులు విడిపోయి మూడు బరులు వేసిన వారంతా ఒకటై ఒకే బరి వేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ గుండాట పాట రూ.10 లక్షల వరకూ వెళ్లినట్టు తెలిసింది. పోలీసులు, ఇతర అధికారులు కోజ మాంసం అడుగుతున్నట్టు సమాచారం. గతేడాది ఒక బరి నుంచి సుమారు 100 కోజలు ఇచ్చినట్టు కథనం. ఈసారి 150 కోజల వరకూ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. సంక్రాంతి పండుగ రాజకీయ నాయకులు, జూదగాళ్లు, కోడిపందేల నిర్వాహలు, కొందరు పోలీసులకు డబ్బులు తెచ్చేది మారింది. ఆదివారం నుంచి అన్నీ సిద్ధం చేస్తున్నారు.కొందరు ముందుగానే పందేలు ఆరంభించాలనే యోచనలో ఉన్నారు. భోగి రోజు నుంచి ఇక ఎవరి ఇష్టం వారిది.

బరులు ధ్వంసం

తాళ్లపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపు కోవాలని కోడి పందేలు, జూదాల వంటి వాటి జోలికి వెళ్లవద్దని తాళ్లపూడి తహశీల్దార్ బి.రవీంద్రనాథ్, కొవ్వూరు రూరల్ సీఐ విజయ బాబు హెచ్చరించారు. తాళ్లపూడి మండలంలోని కొన్ని గ్రామాల్లో కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరులను ఎస్ఐ రామకృష్ణ ధ్వంసం చేయించారు.

జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

రాజమహేంద్రవరంసిటీ,జనవరి11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలు, పేకాటలు,గుండాటలు వంటివి నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్ప టికే జిల్లాలో చాలా చోట్ల బరులు ధ్వంసం చేయడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.యువత జూదక్రీడల్లో పట్టుబడితే వారు భవిష్యత్‌లో ఉద్యోగాలు కోల్పోతారని స్పష్టం చేశారు. సంప్రదాయ క్రీడల్లో పాల్గొని కుటుంబంతో ఆనందంగా ఉండాలని హితవు పలికారు.

పోలీసుల ఆనందం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పోలీసులకు చెల్లించాల్సిన సరెండర్ లీవ్ బకాయిలు రూ.241 కోట్లు శనివారం సాయంత్రం విడుదల చేసింది.ఈ మేరకు పోలీసులు తమ సంతోషాన్ని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పంచుకున్నారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు విడుదల చేసి సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ముందుగానే సంక్రాంతి పం డుగ తీసుకువచ్చారన్నారు. జీపీఎఫ్‌కు రూ.519 కోట్లు, సీపీఎస్‌కు రూ.300 కోట్లు, టీడీఎస్‌కు రూ.265 కోట్లు ,ఫీజురీఎంబర్స్‌మెంట్‌కు రూ.788 కోట్లు,26 వేల మంది కాంట్రాక్టర్లకు రూ.506 కోట్లు, 651 కంపెనీలకు 90 కోట్లు రాయితీ,విద్యుత్ శాఖకు రూ.500 కోట్లు,ఆరోగ్యశ్రీకి రూ.400 కోట్లు, రైతు కౌలు బకాయిలు రూ.241 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

680 మినీ గోకులాలు నిర్మిస్తాం

- జిల్లాలో ఇప్పటికే 304 నిర్మాణం
- రైతులకు 90శాతం సబ్సిడీ అందజేత
- మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మంచి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో రూ.1.85 లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును మంత్రి దుర్గేష్ కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో రూ.15.59 కోట్లతో 680 మినీ గోకులం నిర్మాణాలు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 304 నిర్మాణాలు పూర్తి చేశామన్నారు.రాష్ట్ర వ్యాప్తగా 12,500 గోకులాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిఠాపురం వేదికగా శుక్రవారం ప్రారంభించారన్నారు. పాడి రైతులకు ఎంతో అవసరమయ్యే గోకులాలను గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం 268 నిర్మిస్తే కూటమి ప్రభుత్వం కేవలం ఆరు నెలల కాలంలోనే 12,500 నిర్మించిందన్నారు. ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పశు సంపదను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత, డ్వామా పీడీ నాగ మల్లేశ్వరరావు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో మినీ గోకులం షెడ్డు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి

సంబరాల సంక్రాంతి





జిల్లాలో సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది.. నాయకులు తమ తమ నియోజకవర్గాల్లో ముందస్తు వేడుకలు చేస్తున్నారు.. మంత్రి దుర్గేష్ శనివారం నిడదవోలు నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ చేయగా.. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పుష్కరఘాట్‌లో భోగిమంట వేసి సందడి చేశారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

కేరళ అందాలు సొంతం చేసుకున్న కోనసీమ

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్

ఆత్రేయపురంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు

ఉత్కంఠ భరితంగా ఈత పోటీలు

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేరళ అందాలను సొంతం చేసుకున్న కోనసీమ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురం కాలువ రేవు వద్ద ప్రధాన కాలువలో 3రోజుల పాటు జరిగే సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు శనివా రం ప్రారంభించారు. తొలుతగా ఎంపీ గంటి హరీష్‌మాధుర్ జెండా ఊపి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభించగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ జ్యోతి ప్రజల్వన చేసి పోటీలను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పావురాలను ఎగురవేసి ట్రోఫీ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్విమ్మింగ్ పోటీలు ఆసక్తిగా తిలకించారు. ఆత్రేయపురం రోడ్డు నుంచి అధిక సంఖ్యలో మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన పలువురు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడు తూ సంక్రాంతి సంబరాల నిర్వహణకు ఎంతగానో కృషి చేసిన ఎమ్మెల్యే బండారుతో పాటు వివిధ శాఖల అధికారులను ప్రశంసించారు. గడిచిన ఐదేళ్లలో పర్యాటక రంగం అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం పర్యాటకానికి పెద్దపీట వేస్తుందన్నారు. కోనసీమ ప్రాంతాన్ని పర్యాటకులు ఆకర్షించేలా సీఎం చంద్రబాబు టెంపుల్ టూరిజం, ఈకో టూరిజం, అడ్వచర్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం తీసుకువచ్చినట్టు తెలిపారు. ఎక్కడిక్కడ రిసార్ట్స్ నిర్మించాల్సి ఉందన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం సంక్రాంతిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎంతగానో ఉల్లాసాన్ని అందించడం గర్వకారణమన్నారు. ప్రభుత్వం ఈ ట్రోఫీలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ లొల్ల లాకులు, పిచ్చికలంకలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. ప్రతి ఏటా ట్రోఫీ పోటీలు నిర్వహిస్తామన్నారు. గోదావరి ట్రోఫీ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఈత పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో విజేతలకు మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బండారు బహుమతులు ప్రదానం చేశారు. అమెరికా నుంచి సంక్రాంతి పండుగకు స్వదేశానికి వచ్చిన 70 ఏళ్ల పైబడిన వృద్ధురాలు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనడం విశేషం. సీఐ శివగణేష్ స్విమ్మింగ్ పోటీల్లో మొదటిస్థానం సాధించారు. వివిధ విభాగాల్లో స్విమ్మింగ్, రంగవల్లులు, పతంగి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, గుత్తుల రాంబాబు, జల్లి కామేశ్వరరావు, నరాలశెట్టి వెంకన్న, జుజ్జవరపు హరిబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



ఈత పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ఈత పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి దుర్గేష్

లక్ష్య సాధనకు కష్టపడండి

సినీ హీరో కిరణ్ అబ్బవరం



మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

గండేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మీ గోల్ నిర్ణయించుకోండి దాని కోసమే కష్టపడండి... ఆలోచించండి.. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా రీచ్ అవ్వండి అని సినీ నటుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో నిర్వహిస్తున్న కలర్స్ ఫెస్ట్ యువజనోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. కిరణ్ మాట్లాడుతూ నేను హీరో అవుతానంటే అందరూ నవ్వారు అది పట్టించుకోకుండా ప్రయత్నం చేశాను ఇప్పుడు హీరోగా మీ ముందు ఉన్నాను. పాజిటివ్‌గా ఆలోచించాలని కోరారు. కిరణ్‌ను ఆదిత్య యాజమాన్యం శేషారెడ్డి, సతీష్‌రెడ్డి ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కూడా పాల్గొన్నారు.



కిరణ్‌ను సత్కరిస్తున్న ఆదిత్య యాజమాన్యం

జాబ్ మేళాలో 187మందికి ఉద్యోగాలు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో జరిగిన జాబ్ మేళాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ విద్యార్థులు 187 మంది ప్రముఖ కంపెనీ అమరరాజ గ్రూప్ కంపెనీస్‌లో ఉద్యోగాలు పొందినట్టు కోనసీమ జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ ఎంవిజి.వర్మ తెలిపారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాల బోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.28,76,811 ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు

రూ.28.76లక్షలు ఆదాయం

తెలిపారు. క్యూలలో వేచి ఉన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం రాత్రి సత్యశ్రావణి నృత్యనికేతన్ వారిచే అందించిన ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

శృంగారవల్లభస్వామి ఆలయంలో....

పెద్దాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.82,960, అన్నదాన విరాళాలు రూ.59,975, కేశఖండన ద్వారా రూ.2,320, తు లాభారం, కానుకలు ద్వారా రూ.400, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.15,975 వెరసి రూ.1,61,556 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

నీతి అయోగ్ సదస్సులో 'శాన్ మెరైన్' ప్రాతినిధ్యం

కాకినాడ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10,11 తేదీల్లో విశాఖలో 2 రోజుల పాటు నిర్వహించిన నీతి అయోగ్-2025 సదస్సులో కాకినాడకు చెందిన శాన్ మెరైన్ సంస్థ ప్రాతినిధ్యం వహించింది. ఈ వివరాలను సంస్థ తరఫున శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్, నీతి అయోగ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ఆదానీ, హిందూస్థాన్ షిప్ యార్డ్ వంటి సంస్థలతో కలిసి శాన్ మెరైన్ సంస్థ పాల్గొంది. నౌకా నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశలో అభివృద్ధి చేయడానికి శాన్ మెరైన్ సంస్థ చేసిన సూచనలను నీతి అయోగ్ స్వీకరించింది. షిప్ బిల్డింగ్ రంగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఆదాయ వనరుగా మార్చడానికి భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సదస్సులో విశాఖపట్నం, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి తదితర 8 జిల్లాలను కలిపి విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్‌గా ప్రతిపాదించారు. ఈ సందర్భంగా శాన్ మెరైన్ సంస్థ అధినేత షేక్ అలీషా మాట్లాడుతూ నీతి అయోగ్ సదస్సులో తాము చేసిన సూచనలు స్వీకరించడం చాలాసంతోషంగా ఉందన్నారు.

హైందవ సంస్కృతిని కాపాడాలి



పిఠాపురంలో హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ మహాసభలో ప్రమాణం చేస్తున్న ప్రతినిధులు

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. పిఠాపురంలోని అగ్రహారంలో అనఘా దత్త క్షేత్రంలో హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ పంచమ మహాసభ శనివారం జరిగింది. మైసూరుకు చెందిన వేదపండితుడు కర్రి సంతోష్‌కుమార్ ఘనాపాఠి, హిందూ ధర్మా రక్ష సమితి అధ్యక్షుడు చెదులూరి గవరయ్య, సీనియర్ న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్, ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు దేగల మహేష్, పెండెం శ్రీదేవి మాట్లాడారు. తెలుగురాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక, యానాం తదితర రాష్ట్రాల ప్రతినిధులు సభకు హాజరయ్యారు.

సేవ్ కల్చర్



రంగంపేటలో సేవ్ కల్చర్ అనే నినాదంతో దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకతశిల్పం

ఆకట్టుకున్న దేవిన సిస్టర్స్ సైకతశిల్పం

రంగంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతిని పురస్కరించుకుని సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని (సేవ్ కల్చర్) అనే నినాదంతో తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు దేవిన సోహిత, దేవిన ధన్యత శనివారం సైకతశిల్పం రూపొందించారు. 14 అడుగుల వెడల్పు, 6 అడుగుల ఎత్తు కలిగిన ఈ సైకత శిల్పాన్ని ఇద్దరూ 8 గంటలు శ్రమించి తీర్చిదిద్దారు. ఈ శిల్పంలో ఒక వైపు స్వామి వివేకానంద, మరో వైపు సంక్రాంతి వాతావరణాన్ని చూపించారు. ఈ సందర్భంగా దేవిన సిస్టర్స్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఒక్క క్షణంలో.. ఘోరం!



శంఖవరం మండలం కత్తిపూడిలో జరిగిన ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిఉన్న మృతదేహాలు

- అన్నవరం దైవదర్శనానికి వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. రెండు కుటుంబాల్లో విషాదం
- ఉదయం 7గంటల సమయంలో ప్రమాదం
- ముగ్గురి మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు
- కాకినాడ జిల్లా కత్తిపూడి జాతీయ రహదారిపై ఘటన
- మృతులు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాసులు

శంఖవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మరొక పది కిలోమీటర్లు పయనిస్తే ఆ కుటుంబం సత్యదేవుని సన్నిధిలో సంతోషంగా ఉండేది. వారింట సంక్రాంతి సందడి మిగిలేది. దూరం నుంచి వస్తూ గమ్యానికి దగ్గరలోకి వచ్చినా మృత్యు ఒడిలోకి చేరడంతో వారికి విషాదమే మిగిలింది. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తెల్లవారుజామునే బయలుదేరి..

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్‌కి చెందిన చవ్వాకుల శ్యాంప్రసాద్, అతని బావమరిది కరింశెట్టి శివన్నారాయణ, కరింశెట్టి శివన్నారాయణ భార్య దివ్య, కరీంశెట్టి సత్యనాగమధు, శ్యాంప్రసాద్ భార్య చవ్వాకుల ప్రసన్న, తల్లి అమ్మాజీ, కారు డ్రైవర్ నిమ్మగడ్డ ధనుష్ కలిసి శనివారం తెల్లవారుజామున అన్నవరం రావడానికి ఉదయం 4-5 గంటల మధ్యలో కారులో బయలుదేరారు. వీరి వాహనం ఉదయం 7 గంటల సమయంలో అన్నవరానికి దగ్గర్లోనే పది కిలోమీటర్ల ముందు కత్తిపూడి వద్దకు చేరుకుంది. అక్కడ ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో చవ్వాకుల శ్యాంప్రసాద్(50), కరింశెట్టి శివన్నారాయణ (38), కరింశెట్టి దివ్య(30) అక్కడికక్కడే మృతి చెందగా మిగిలినవారు తీవ్రంగా గాయపడ్డారు. శ్యాంప్రసాద్ భార్య ప్రసన్న, తల్లి అమ్మాజీ అపస్మారక స్థితిలో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ ధనుష్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం జరిగిన తీరు చాలా ఘోరంగా ఉంది. వీరు ప్రయాణించే ఎర్టిగా కారు నుజ్జునుజ్జవడంతోపాటు రహదారులన్నీ రక్తమోడి చూపరులు చలించిపోయారు. ఈ ప్రమాదానికి స్పష్టమైన కారణం తెలియనప్పటికీ నిద్రమత్తుగానీ, లారీని గమనించకపోవడంగానీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు.

క్షతగాత్రులను స్థానికుల సహాయంతో తుని, ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లారు. ప్రత్తిపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కరీంశెట్టి శివనారాయణ మృతి చెందగా అమ్మాజీ, సత్యనాగమధులను మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన లారీయే కారణం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆగి ఉన్న లారీలపై పోలీసులు చర్యలు చేపట్టకపోవడంతో ఇష్టానుసారంగా లారీలను నిలిపివేస్తున్నారు. దీంతో ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడడంతోపాటు వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

భీమవరంలో విషాదఛాయలు

భీమవరం క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చవ్వాకుల శ్యాంప్రసాద్ మృతితో భీమవరంలోని ఆయన నివాసం వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. అతడు భీమవరం గన్నాబత్తుల వారివీధిలో ఉంటున్నాడు. ఆయనకు సంతానం లేరు. యనమదుర్రులో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని బావమరిది అయిన కరింశెట్టి శివన్నారాయణ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందినవాడు. ఆయన కూడా ప్రస్తుతం భీమవరంలోనే ఉంటున్నారు. అతనికి కూడా సంతానం లేనట్లుగానే బంధువులు తెలిపారు.



చవ్వాకుల శ్యాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)



భీమవరంలో విచారం వ్యక్తం చేస్తున్న శ్యాంప్రసాద్ బంధువులు

మధ్యాహ్నానికి వచ్చేస్తానని వెళ్లి..

అన్నవరం దేవాలయానికి వెళ్లి దర్శనం అనంతరం మధ్యాహ్నానికి ఇంటికి వచ్చేస్తామని వారి కుటుంబసభ్యులకు ముందురోజే శ్యాంప్రసాద్ చెప్పాడు. ఇప్పుడు ఆయనతోపాటు చెల్లి, బావ కూడా ముగ్గురు మృతి చెందడంతో వీరి కుటుంబీకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. శ్యాంప్రసాద్‌కు అన్నదమ్ములు ముగ్గురుకాగా, పెద్దవారైన మోహన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రెండో సోదరుడు తాతాజీ 20ఏళ్ల క్రితం కృష్ణా పుష్కరాల్లో గల్లంతు కావడంతో అప్పటినుంచి తల్లి బెంగతోనే ఉన్నారు. మూడో సోదరుడు శ్యాంప్రసాద్ అందరినీ చూసుకుంటున్నాడు. దీంతో ఆఇంట విషాదం అలుముకుంది.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు



కేసు వివరాలు తెలుపుతున్న సీఐ దొరరాజు

కె.గంగవరం,జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలోని కె.గంగవరం మండలంలోని కూళ్ల గ్రామంలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు చేధించారు. దీనికి సంబంధించి మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, పామర్రు ఎస్ఐ జానీబాషా విలేకరులకు వివరాలు తెలిపారు. సువర్ణరత్నం, మంచాల సూర్యచంద్రరావు స్నేహితులు. సువర్ణరత్నం తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో సూర్యచంద్రరావు సువర్ణరత్నం అలియాస్ శివను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. సూర్యచంద్రరావును కూళ్ల ఏటిగట్టుమీద అరెస్టు చేశామని, రామచంద్రపురం కోర్టుకు పంపించినట్లు వారు చెప్పారు.

భార్య బుగ్గను కొరికిన భర్త అరెస్టు

గొల్లప్రోలు రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ముక్క ఊడేలా భార్య బుగ్గను కొరికి పైశాచికత్వం ప్రదర్శించిన భర్తను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన దాసం నాగబాబు తన భార్యను పిల్లలు పుట్టలేదనే నెపంతో మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో నాగబాబు తన భార్య శేషారత్నం మెడను కొరికి చంపాలని ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో బుగ్గను మాంసం ముద్ద వచ్చేలా కొరికి దాన్ని పళ్లతో పెరికివేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నాగబాబును శనివారం తాటిపర్తిలో అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

20 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు



ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీవో

రావులపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి రావులపాలెం వైపు వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీ చేసి 20 ట్రావెల్ బస్సులపై కేసు నమోదు చేసినట్టు జిల్లా రవాణా శాఖాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. రావులపాలెం మండలం ఈతకోట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఆయన స్థానిక అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రయాణికుల వద్ద నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం, భద్రతా నియమాలు పాటించకపోవడంతో 20 బస్సులపై కేసు నమోదు చేసి రూ.74,500 అపరాధ రుసుము విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీలు జనవరి 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

ధర్మవరంలో కోలాహలంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు

- సీనియర్స్‌లో గుమ్మిలేరు, జూనియర్స్‌లో ధర్మవరం ఎడ్ల జతలకు ప్రథమ బహుమతులు





ధర్మవరం- పోలవరం కాలువ గట్టులో పరుగులు పెడుతున్న ఎడ్లు

ప్రత్తిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవం మహోత్సవాలు, సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు శనివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఈ పోటీలను ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో కోనసీమ జిల్లాగుమ్మిలేరు, జూనియర్స్ విభాగాల్లో కాకినాడ జిల్లా ధర్మవరం ఎడ్ల జతల కు బహుమతులు కైవసం చేసుకున్నాయి. ధర్మవరం పోలవరం కాలువ గట్టుపై ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఉభయగోదావరి, కృష్ణ జిల్లాలకు చెందిన 36 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా తేజ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జత కు ద్వితీయ బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన తేజచౌదరికి చెందిన ఎడ్ల జత కు తృతీయ బహుముతి సాధించాయి. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా ధర్మవరానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, తూర్పుగోదావరి జిల్లా కాపవరానికి చెందిన కుంచం మనోజ్ ఎడ్ల జతకు ద్వితీయ బహుమతి, తూర్పుగోదావరి జిల్లా వడిశలేరుకు చెందిన పైడిశెట్టి రిథం వీర కృష్ణశ్రీ ఎడ్ల జతకు తృతీయ బహుమతి లభించాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతికి రూ.15వేలు, ద్వితీయ బహుమతికి రూ.12వేలు, తృతీయ బహుమతికి రూ.8వేలు, షీల్డ్‌లను విజేతలకు అందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా యనమల కృష్ణ, నానాజీ, ఫణి వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు పురస్కరించుకుని ధర్మవరం పోలవరం గట్ల ప్రదేశాలు శనివారం జనసంద్రంగా మారాయి. ధర్మవరం రామభద్రరావు చెరువు పరిసరాల్లో ముందురోజే చేరుకున్న ఎడ్ల జతకు నిర్వాహకులు టెంట్లు, షామియానాలతో శిబిరాలు ఏర్పాటు చేసి భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్న నేటి ఆధునిక కాలంలో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తున్న కమిటీని అభినందించారు. ఎన్డీయే కూటమి శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

- పలు రాష్ట్రాలనుంచి క్రీడాకారుల రాక
- తూర్పుగోదావరి జిల్లా వేళ్లచింతలగూడెంలో నిర్వహణ



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యువత విద్యతోపాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వేళ్లచింతలగూడెంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ ఛైర్మన్ గంటా మధుకృష్ణ, ఎమ్మెల్యే మద్దిపాటి ఆధ్వర్యంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. పలు రాష్ట్రాలనుంచి వచ్చిన క్రీడాకారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్య మిస్తోందన్నారు. మూడురోజులపాటు జరిగే ఈ పోటీల్లో 9 పురుషుల జట్లు, 10 మహిళా జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. పురుషులకు సంబంధించి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ పట్నం, తూర్పుగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు, మహిళలకు సంబంధించి ఇండియన్ రైల్వే బ్లూఏ, ఇండియన్ రైల్వే ఆరెంజ్-బీ, ఆంధ్రప్రదేశ్-ఏ, తెలంగాణ-ఏ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీబీ, చైనీస్, చత్తీస్‌ఘడ్-ఏ, హరియాణా-బీ, కర్ణాటక రాష్ట్రాలకు జట్లు పాల్గొంటాయన్నారు. శనివారం పురుషుల విభాగం నుంచి నెల్లూరు, ప్రకాశం జట్లు బరిలో దిగినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ ఛైర్మన్ గంటా మధుకృష్ణ, సీఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్, సంక్రాంతి సంబరాల కమిటీ సభ్యులు, కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి(రాము), పిన్నమనేని చినబాబు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో గుప్పుమన్న గంజాయి

- నిడదవోలులో 22 కిలోల స్వాధీనం
- 11 మంది యువకుల అరెస్టు



గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిడదవోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిడదవోలులో రూ.1.10లక్షల విలువైన 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 11మంది యువకులను అరెస్ట్ చేసినట్టు సీఐ పీవీజీ తిలక్ అన్నారు. పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిడదవోలు పట్టణ శివారు తీరుగూడెం ప్రాంతంలోని టిడ్కో ఇళ్లవద్ద గంజాయి విక్రయాలు సాగుతున్నాయనే సమాచారంతో దాడి చేసి 11మంది యువకులను అరెస్ట్ చేసి 22 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజుపేటకు చెందిన డొంకా ప్రవీణ్‌కుమార్, రైల్వే క్వార్టర్స్ సమీపంలో నివాసముండే ఆముదాల రవి, దేవరపల్లికి చెందిన కొప్పాక అఖిల్‌కుమార్, పల్లంట్లకు చెందిన దొండపాటి గంగాధర్, నిడదవోలు మండలం కంసాలిపాలేనికి చెందిన ఎలిచర్ల మిథున్‌దాస్, నిడదవోలుకు చెందిన కాకి పవన్, మజ్జి భానుప్రకాష్, కాకరపర్తి మహేష్, విశాఖ జిల్లాకు చెందిన కోరా రామచంద్రరావు, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గోపీ గోలారి తదితరులను అరెస్ట్‌చేశామని సీఐ పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పూర్తిస్థాయిలో ప్రత్యేక దృష్టిసారించామని, అందులో భాగంగానే ఈ దాడి నిర్వహించామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు పి.శోభన్‌కుమార్, పరమహంస తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని.. యువతి మృతి



రేణుక మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పండుగపూట ఇంటికి వెళ్లి తన కుటుంబంతో ఆనందంగా గడుపుదామనుకున్న తరుణంలో ఆ యువతిని మృత్యువు రోడ్డు ప్రమాదంరూపంలో కబళించింది. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన దేగల రేణుక(18) రాజమహేంద్రవరంలో డిప్లమో కోర్సు చదివింది. అనంతరం కాకినాడ జగన్నాథపురంలోని తన అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ కంప్యూటర్ కోర్సు చదువుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి తన తాతయ్య ఏసుతో కలిసి ద్విచక్రవాహనంపై మెయిన్ రోడ్డుకు వెళ్లి కొత్త బట్టలు కొనుగోలు చేసి స్వస్థలానికి వెళ్లి నూతన వస్త్రాలు ధరించి పండగ చేసుకుందామనుకుంది. తాతతో కలిసి జగన్నాథపురం శివాలయంవద్ద ఉన్న ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో వారి వాహనం ఘాటీ సెంటర్ సమీపంలోని చేపలమార్కెట్ వద్దకు వచ్చేసరికి వేగంగా వస్తున్న లారీ వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో రేణుక ఎగిరిపడి తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అది గమనించిన స్థానికులు ఆమెను జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. అనంతరం వన్‌టౌన్ ఎస్ఐ స్వామినాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్తమూరులో ఎరువుల వ్యాపారి రూ.2.3కోట్ల మేర కుచ్చుటోపీ

మండపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అతడో ఎరువుల వ్యాపారి గ్రామంలో ఉన్న బంధువులు, స్నేహితులు అందరితో కలుపుగోలుగా ఉంటున్నట్టు నటిస్తూ చాలామంది నుంచి ఒకరికి తెలియకుండా మరొకరివద్ద వ్యాపారం కోసమని వడ్డీ ఇస్తానని నమ్మబలికి రూ.2.3కోట్ల మేర అప్పుగా నగదును తీసుకుని ఊరువదిలి ఉడాయించిన వ్యాపారి ఉదంతమిది. బాధితుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన గోలుగూరి గౌరిశంకర్‌రెడ్డి గ్రామంలో ఎరువుల దుకాణం నడుతున్నాడు. దుకాణానికి వచ్చే బంధువులైన రైతుల నుంచి, పరిచయం ఉన్న బాగా తెలిసిన రైతులనుంచి రూ.లక్షల్లో అప్పులు చేసి వడ్డీ చెల్లించకపోవడం, అసలు ఇవ్వకపోవడం ఆరునెలలగా జరుగుతోంది. కాగా, అతడు ఇటీవల ఎరువుల దుకాణంతోపాటు తన ఇంటికి తాళం వేసి కనిపించకుండాపోయాడు. అతడికి ఫోన్ చేసినా పనిచేయకపోవడంతో బాధితులంతా తాము మోసపోయామని గ్రహించి అర్తమూరులో వున్న అతడి ఇంటివద్ద రెండురోజులుగా ఆందోళనకు దిగారు. బంధువులు, స్నేహితులు, సన్న,చిన్నకారు రైతులే లక్ష్యంగా వారి నుంచి భారీగా నగదును అప్పుగా తీసుకుని బోర్డు తిప్పేయడంతో అసలు ఏం చేయాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. అతడి కుటుంబసభ్యులు కూడా తమకు సమాధానం చెప్పడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటివరకు 40మంది వరకు అప్పులు ఇచ్చిన బాధితులు ఉన్నారని తెలుస్తోంది. ఇక చేసేదిలేక వ్యాపారికి చెందిన ఇంటికి తాళంవేశారు. శనివారం బాధితులు అంతా అర్తమూరులో పరారీలో ఉన్న రెడ్డి ఇంటివద్ద ఆందోళన చేశారు.

కూలి పనులు చేసుకుని జీవనం సాగించే సన్న, చిన్న కారులతోపాటు చాలామంది వద్ద ఒకరికి తెలియకుండా మరొకరినుంచి భారీగా నగదును అప్పులుగా చేసి గ్రామంలో పత్తాలేకుండా వ్యాపారి పోవడంతో అసలు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో బాధితులు ఉన్నారు. తమకు జరిగిన నష్టం మోసపోయిన వ్యవహారంపై బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామంలో ఎరువులు వ్యాపారం నిర్వహించే వ్యాపారి బారిన ఎరువులు సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులు కూడా ఉన్నారు. తాము కూడా భారీగా నగదు అప్పుగా ఇచ్చామని వారు లబోదిబోమంటున్నారు.


పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలించిన పార్లమెంట్ కమిటీ సభ్యులు

రాత్రికి రాజమండ్రిలో సందడి

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ జలశక్తి స్టాండింగ్ కమిటీ సభ్యులైన 11మంది ఎంపీలు శనివారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. కమిటీ ఛైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీ ఆధ్వర్యంలో ఎంపీలు శుక్రవారం రాత్రి రాజమండ్రి వచ్చిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం వెళ్లి తిరిగిరాత్రికి రాజమండ్రికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం విమానాశ్రయం నుంచి తిరిగి తమ ప్రాంతాలకు చేరుకుంటారు. ఈ ఎంపీల బృందం ముందుగా పోలవరం ప్రాజెక్టులోని స్పిల్‌వే ప్రాంతాన్ని సందర్శించింది. తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పరిశీలించి, ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ కట్టే ప్రాంతంలో నిర్మించనున్న డయాఫ్రంవాల్ గురించి ఆరా తీశారు. ఫొటో ఎగ్జిబిషన్లను కూడా పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్,పోలవరం ఈఎన్‌సీ మామిడి వెంకటేశ్వరరావు ప్రాజెక్టు గురించి వివరించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రంవాల్ గురించి ఎక్కువగా అడగడం గమనార్హం. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు ఎందుకనే సందేహాన్ని కూడా వెలిబుచ్చినట్టు సమాచారం.

అన్యమత ప్రచారాన్ని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం

బండారులంకలో ఉద్రిక్తత.. సద్దుమణిగిన వివాదం



బండారులంకలో ఏజీ రోడ్డుపై ఆందోళనకు దిగిన కార్యకర్తలు

అమలాపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న వారిపై దౌర్జన్యానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి దౌర్జన్యానికి దిగిన వారితో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ బండారులంక బ్యాంకు కాలనీ వీధికి ఒక మతానికి చెందిన వారు ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. అక్కడినుంచి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ మత ప్రచారం చేశారు. అక్కడే ఉంటున్న బళ్లసాయినాగమల్లేశ్వరరావు కుటుంబం వద్దకు వచ్చేసరికి ఆయన ఎందుకు అన్యమత ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన వారు ఒక్కసారిగా దౌర్జన్యానికి దిగారు. వారికి, స్థానికులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పలువురు నాయకులు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆందోళనకారులతో చర్చలు జరిపి అవతలి వర్గం వారితో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది.

బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద మృతి

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండగా శనివారం పోలీసులు కనుగొన్నారు. పట్టణంలోని మాధవపురం రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిసమీపంలోని బావిలో పడి కుళ్లిపోయి ఉన్న యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు. ఇతనిని ఇందిరానగర్‌కు చెందిన గారా జాన్(43)గా గుర్తించారు. ఎలా మరణించాడన్న అంశంపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వాలీబాల్ పోటీల విజేత రామేశ్వరం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ముఖ్యఅతిథులు

అనపర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు నెస్కో సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ నేత్ర వైద్యులు, రాష్ట్ర నెష్టమాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు తేతలి సత్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా హైదరాబాద్‌కు చెందిన నెస్కో సంస్థ ఆధ్వర్యంలోని నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభకు సత్యనారాయణ రెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి ముఖ్యఅతిథులుగా విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో 30 గ్రామాల నుంచి జట్లు పాల్గొనగా పెదపూడి మండలం రామేశ్వరం జట్టు విజేతగా నిలిచింది. అనపర్తి ద్వితీయ, ఊలపల్లి తృతీయ, ఈలకొలను నాలుగో స్థానాల్లో నిలిచాయి. బెస్ట్ ప్లేయర్స్‌గా జి.అజయ్, ఎల్.ఫణీంద్ర, ఆల్ రౌండర్‌గా ఎన్.వెంకటేష్ నిలిచారు. కార్యక్రమంలో నెస్కో చైర్మన్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, పారిశ్రామికవేత్త తేతలి ఉపేంద్రరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, సత్తి పోతారెడ్డి, పీఈటీలు వీర్రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సమీక్షించాలి

పార్లమెంట్ కమిటీకి ఆదివాసీ మహాసభ వినతి



సమావేశంలో మాట్లాడుతున్న అయినాపురపు సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ బృందాలు నిర్వాసితులు సమస్యలపై కూడా సమీక్ష నిర్వహించాలని ఆదివాసి మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ప్రతినిధులను రాజమహేంద్రవరంలో కలిసి వినతిపత్రం అందించామన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి లక్ష కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశామన్నారు. నిర్వాసితులు సమస్యలపై సమగ్ర చర్చ జరిపి సమీక్షించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కాగ్ నివేదిక పేర్కొన్న విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పోలవరం ప్రాజెక్టు విషయమై అవగాహన ఒప్పందంలేదన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వెంటనే కేంద్రానికి నివేదించి అవగాహన ఒప్పందం కుదుర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సమావేశంలో అల్లూరి జిల్లా నాయకులు గడుతూరి చిన్నారావు, అరగంటి వీరభద్రారెడ్డి, జక్కుల పాండవులు, కెచ్చెల రెడ్డి, మద్దిపాటి సతీష్, పోశమ్మ, ప్రేమగిరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటన రాజకీయం చేయడం తగదు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దురదృష్టకరమైన సంఘటనలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం దౌర్భాగ్యమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమల దుర్ఘటన బాధాకరమన్నారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తునకు సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారని చెప్పారు. తిరుపతి దుర్ఘటనను వైసీపీ నాయకులు రాజకీయం చేయడం తగదన్నారు. టీటీడీ చైర్మన్‌పై ఈవో వ్యవహరించిన తీరు సమంజసంగా లేదన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటారని చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు నిమ్మలపూడి గోవింద్, జక్కంపూడి అర్జున్, మళ్ళ వెంకట్రాజు పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజమహేంద్రవరం డీఎస్పీ భవ్య కిషోర్

అనపర్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో జరిగే అమ్మవార్ల జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాజమహేంద్రవరం డీఎస్పీ భవ్య కిషోర్ తెలిపారు. శనివారం అనపర్తిలో వీరుళ్లమ్మ జాతర సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఆలయ కమిటీ ప్రతినిధులతో వాటి ఏర్పాట్లపై సమీక్షించారు. జాతర ఏర్పాట్ల విషయాలను కమిటీని అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కోడి పందాలబరులు ధ్వంసం: మండలంలో పలు గ్రామాల్లో కోడి పందాల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను గుర్తించిన ఎస్ఐ శ్రీను నాయక్ శనివారం ట్రాక్టర్లతో బరుల ఏర్పాట్లను ధ్వంసం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ కోడి పందాలు నిర్వహించడం నేరమన్నారు. కోడి పందాలు నిర్వహించే వారిపై చర్యలు తప్పవని అన్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

బిక్కవోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పేరుతో కోడి పందాలు, గుండాట, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సత్యకృష్ణ హెచ్చరించారు. శనివారం ఆయన పోలీస్ సిబ్బందితో కలసి గత ఏడాది కోడిపందాలు నిర్వహించిన బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెం, పందలపాక, కాపవరం గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో కోడిపందాలు, గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



కోడిపందాలు ఆడితే చర్యలు తప్పవంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న తహశీల్దార్ సత్యకృష్ణ

యాచకుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోపాల నగర్ పుంత రోడ్డులో అపస్మారకస్థితిలో పడివున్న యాచకుడు మృతి చెందాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం గోపాల్‌నగర్ పుంత రోడ్డులో శుక్రవారం సుమారు 55 నుంచి 60 మధ్య వయసు కలిగిన వ్యక్తి అపస్మారక స్థితిలోపడి వున్నాడని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో వారు చేరుకున్నారు. ఆ వ్యక్తి యాచకుడని పోలీసులు గుర్తించి వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి శనివారం మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పేరు, ఊరు గుర్తించాల్సి వుందన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చాగల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చాగల్లు రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న డ్రైనేజీ వద్ద శనివారం పోలీసులు గుర్తు తెలియని మృతదేహాలు గుర్తించారు. ఎస్ఐ కె.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. జమాల్పూర్ జంక్షన్ నుంచి సికింద్రాబాద్ వెళుతున్న రైలు నుంచి సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసున్న గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని రైల్వేస్టేషన్ అధికారులు తెలియజేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వడ్డే ఓబన్న జయంతి

బిక్కవోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రేనాటి స్వాతంత్ర్య సమర యుద్ధ వీరుడు వడ్డే ఓబన్న జయంతిని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిపారు. ఆయన చిత్రపటానికి పరిపాలనాధికారి వీడీ రత్నకుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



ఓబన్నకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

బిక్కవోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కొంకుదురు బుడతల మామిడి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం రాత్రి ఘనంగా జరిపారు. గ్రామానికి చెందిన సత్తి నాగిరెడ్డి, సుశీల దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు అందించారు. అర్చకులు రమణశర్మ, శ్రీనివాసశర్మ స్వామివారి కల్యాణం జరపగా, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గోదావరి చెంతన అంబరాన్నంటిన

సంక్రాంతి సంబరాలు



రాజమహేంద్రవరం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

- పుష్కరాల రేవు వద్ద సందడి
- నగరంలో పల్లె వాతావరణం
- 126 మందికి బహుమతులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి చెంతన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. 15 రోజులుగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగరంలో 42 డివిజన్లలో భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 15వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో 126 మందిని ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా ఎంపిక చేసి మిగిలిన వారందరికీ కన్సోలేషన్ బహుమతులను ఏరోజుకారోజు అందించారు. విజేతలకు శనివారం సాయంత్రం పుష్కరాల రేవు వద్ద నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ప్రదానం చేశారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, కుడుపూడి సత్తిబాబు, ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ అధ్యక్షుడు బొమ్ము దత్తు విచ్చేశారు. పుష్కరాల రేవు వెలుపల ప్రాంగణం భోగిమంటలు, గంగిరెద్దుల సందడి, హరిదాసుల హరినామసంకీర్తనలతో సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము చాలా కష్టాలు పడ్డామన్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో ఎన్నో చేశామన్నారు. బ్లేడు, గంజాయిబ్యాచ్‌లను అరికట్టామని, రూ.10 కోట్లు అభివృద్ధి పనులు చేశామని, రూ.20 కోట్ల పనులు ప్రారంభించామన్నారు. ఇంకా రూ.60 కోట్ల పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. గత పాలకులు చేసిన పనులు నగరానికి శాపంగా మారాయన్నారు. అన్ని లెక్కలు తెలుస్తామన్నారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసు నగరాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్నారన్నారని, చక్కటి వాతావరణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాజమహేంద్రవరంలో అన్నిడివిజన్లలోను ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. అనంతరం 42 మంది ప్రథమ విజేతలకు సోఫాసెట్‌లు, 42 మంది ద్వితీయ విజేతలకు బీరువాలు, 42 మంది తృతీయ విజేతలకు డ్రస్సింగ్ టేబుల్స్‌ను ముఖ్యఅతిథుల చేతులమీదుగా అందించారు. మహిళలంతా ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరావు, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, యిన్నమూరి దీపు, ఎన్‌డీ వరప్రసాద్, కురగంటి సతీష్, కోసూరి చండిప్రియ పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన రాజమహేంద్రవరం నగర వాసులు

విద్యాసంస్థల్లో వేడుకలు

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని శ్రీప్రకాశ్ విద్యానికేతన్(ఇంగ్లీష్ మీడియం)స్కూల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీప్రకాష్ పురం గ్రామాన్ని నిర్మించి సంప్రదాయ దుస్తులు ధరించి, సంక్రాంతి శోభను గుర్తుచేశారు. ఇల్లు నిర్మాణం, గ్రామ దేవత ఆలయం, పశువుల పాక, వ్యవసాయ పనిముట్లు, బావి, రోలు, రోకళ్లు, తిరగళ్లు, రచ్చబండ, సంప్రదాయ పిండివంటలు, భోగి మంటలు, గంగిరెద్దులు, రంగవల్లులు, హరిదాసు, సోదెమ్మ, పిట్టల దొర, గొబ్బెమ్మల వేషధారణలు, బొమ్మల కొలువులతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఏపీ కార్యదర్శి వోలేటి సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎఎస్ఎన్ మూర్తి, అకడమిక్ కోఆర్డినేటర్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో బొమ్మల కొలువు, భోగి మంటలు, ప్రభల ఊరేగింపు చేపట్టారు. సంప్రదాయ పిండి వంటలు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ బి.కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ టీవీ జనార్దనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. కానవరంలోని గాయత్రి విద్యాసంస్థల్లో జరిగిన సంబరాల్లో విద్యార్థులు భోగి మంటలు, గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. హరిదాసు, గంగిరెద్దుల వేషధారణలతో సందడి చేశారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. గురువులను సత్కరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గాయత్రి కళాశాల కరస్పాండెంట్ వీవీవీఎస్ఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ బంగారం, అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కానవరం గాయత్రి విద్యాసంస్థల్లో భోగి మంటలు

గోదావరిలో మునిగి

ఇసుకతీత కార్మికుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం గోదావరిలో ఇసుక తీతపనులు చేసే కార్మికుడు కర్రి రాంబాబు ప్రమాదవశాత్తూ మునిగి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకివెళితే.. ధవళేశ్వరం గ్రామం వాడపేటకు చెందిన కర్రి రాంబాబు(40) గోదావరిలోకి నావలో వెళ్ళి ఇసుత తీత పనులు చేస్తుండగా ఛాతినొప్పి వచ్చింది. ఈ క్రమంలో నీటిలో పడిపోయాడు. దీంతో అతనితో పనికి వెళ్లిన వారు వెంటనే స్పందించి అతని బయటకు తీసేలోపు మృత్యువాత పడ్డారు. కాగా రాంబాబుకు భార్య, పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

20 శాతం మార్జిన్ పెంచాలి

వైన్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న బాలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపులు నిర్వహించేటప్పుడు గెజిట్‌లో పేర్కొన్న విధంగానే 20శాతం మార్జిన్ ఇవ్వాలని లేకుంటే అప్పులు పాలై దుకాణాలు మూసుకోకతప్పదని రాజమహేంద్రవరం వైన్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణ, బాలు ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యంపై తమకు ప్రభుత్వం ప్రస్తుతం 10 శాతం మార్జిన్ మాత్రమే ఇస్తుందన్నారు.దీంతో ఈ మూడు నెలల కాలంలో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల నష్టాల్లోకి వెళ్ళిపోయామన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో 14.5శాతం మార్జిన్ పెంచినట్టు ప్రభుత్వం ప్రకటించినా అది కూడా అమలు కాలేదన్నారు. 20 శాతం మార్జిన్ ప్రకటిస్తూ జీవో జారీ చేయాలని లేకుంటే మద్యం దుకాణాలు మూసివేస్తామన్నారు. మరో పక్క మద్యం వ్యాపారులను రాజకీయాల్లోకి లాగుతున్నారని ఇది సరికాదన్నారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. తాము ఎమ్మెల్యేకు డబ్బులు ఇస్తున్నామనడం పూర్తిగా అవాస్తమన్నారు. సమావేశంలో మేకా రమేష్, గంటా స్వరూప్, ఆకుల శ్యామ్, పి.రామకృష్ణ, బుజ్జి పాల్గొన్నారు.

యువజన దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మనసును పవిత్రంగా ఉంచడం ద్వారా మానసిక బలం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం అలవడతాయని స్వామి సేవ్యానందజీ మహరాజ్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా శనివారం రామకృష్ణ మిషన్‌లో విద్యార్థులకు యువజన సదస్సు నిర్వహించారు. నగరంలోని జూనియర్ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్వామి పరుజ్ఞేయానంద మహరాజ్ మాట్లాడుతూ భారత దేశం గొప్పతనాన్ని ప్రపంచానికి మొట్టమొదటిగా తెలియజేసింది స్వామి వివేకానందుడే అన్నారు. మిషన్ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ ప్రతి పనిలో మనం నైతిక బలాన్ని ప్రదర్శించాలని తెలిపారు. విద్యార్థులకు స్వామి వివేకానంద సాహిత్యాన్ని పంపిణీ చేశారు.




రంగంపేటలో భోగిమంటను వెలిగించిన మనోజ్

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

రంగంపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వడిశలేరు గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లమిల్లి మనోజ్ ముగ్గుల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ మాట్లాడుతూ ఈ పోటీల్లో 140 మంది మహిళలు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందించామన్నారు. కార్యక్రమంలో ముందుగా భోగి మంటను వెలిగించగా, హరిదాసు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండల, గ్రామ ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

ఆదిత్య కాలేజీలో...

రాజమహేంద్రవరం కల్చరల్: ఆదిత్య కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరై సందడి చేశారు. విద్యార్థినులు అందమైన రంగవల్లులు వేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ రెహమాన్, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, కోసూరి చండీప్రియ, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, చంద్రశేఖర్, రామకృష్ణ, జీవీఎస్. నాగేశ్వరరావు, బీహెచ్‌వీ రమాదేవి పాల్గొన్నారు.



కిడ్నీ బాధితుడికి మందులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

కిడ్నీ బాధితుడికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి సాయం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శనివారం రెండు నెలలకు సరిపడా మందులు అందించారు. తిలక్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బర్మా కాలనీకి చెందిన ఎస్.కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుసుకున్న వాసు సహాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బుడ్డిగ రవి, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ పాల్గొన్నారు

ఎన్ఎంఈ లూథరన్ చర్చ్ అడహక్ కమిటీ ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం ఎన్ఎంఈ లూథరన్ చర్చ్ అడహక్ కమిటీని ఏర్పాటు చేసినట్టు సంఘకాపరి గుర్రపు కిరణ్ బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చర్చ్‌కు సంబంధించి కోర్టులో ఉన్న కేసులో గతనెల 23న ఇచ్చిన ఆర్డర్ ప్రకారం తాను సంఘకాపరిగా నిర్ధారించడం జరిగిందన్నారు.

'వానపల్లి'కి ముఖేష్ అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిత్ మోహన్ మిత్ర మ్యూజికల్ అకాడమీ గాయకుడు వానపల్లి శ్రీమన్నారాయణకు జిత్‌మోహన్‌మిత్ర కళావేదికలో శనివారం హిందీ గాయకుడు ముఖేష్ స్మారక పురస్కారం అందించి సత్కరించారు. జిత్ మోహన్‌మిత్ర మాట్లాడుతూ తన పాటలతో బాలీవుడ్‌లో చెరగని ముద్ర వేసిన ముఖేష్ పురస్కారాన్ని సీనియర్ గాయకుడు శ్రీమన్నారాయణకు అందించడం సంతోషంగా ఉందన్నారు. గాయనీ, గాయకులు డాక్టర్ నళిని, డాక్టర్ హరి, గుంటూరి శ్రీనివాస్, పోస్టల్ ప్రసాద్ శ్రోతలను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో జి.నరసింహమూర్తి, రమేష్, సీహెచ్ విశ్వనాథ్, పణి, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

'జగనన్న కాలనీల పేరు మార్పు సరికాదు'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పేరుతో ఏర్పడిన కాలనీలకు ఆయన పేరును మార్పడం కూటమి ప్రభుత్వానికి తగదని వైసీపీ ఎస్సీ సెల్ రాజమహేంద్రవరం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మాసా రామ్ జోగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వైసీపీ హయాంలో మంజూరు చేసిన పనులే చేస్తోందే తప్ప కొత్తగా చేసిందేమీ లేదన్నారు.

స్వర్ణాంధ్ర డైరీ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2025 డైరీ ఆవిష్కరణ శనివారం జరిగింది. లాలాచెరువు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ 27వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు రూపొందించిన డైరీని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు సంధ్యారాణి ఆవిష్కరించారు.

బీఎంపీ క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీఎంపీ అసోసియేషన్ రాజమహేంద్రవరం రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ వ్యవస్థాపకుడు లంకా సత్యనారాయణ శనివారం ఆవిష్కరించారు. బాపూజీ నగర్ సిద్ధు ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో కార్యక్రమం జరిగింది. రాష్ట్ర నాయకులు కొమ్మా శ్రీనివాస్, ఆకాశం గౌరీష్, ఎస్‌కె.ఇమామ్, కన్నాబత్తుల శ్రీనివాస్, పక్కుర్తి సత్యనారాయణ, డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'టీటీడీ బోర్డు రద్దు చేయాలి'

మాజీ ఎంపీ భరత్ రామ్ డిమాండ్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట దుర్ఘటనకు టీటీడీదే బాధ్యతని, వెంటనే బోర్డును రద్దు చేయాలని శనివారం మాజీ ఎంపీ భరత్ రామ్ అన్నారు. సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసినంత మాత్రాన నేరం మాఫీ కాదని.. నిందితులను శిక్షించే వరకూ బాధితుల పక్షాన పోరాడతామన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

అభివృద్ధి కార్యక్రమాలకు

ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపనలు


రాజమహేంద్రవరం రూరల్ జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని పిడింగొయ్యి, రాజవోలు గ్రామాల్లో రూరల్ ఎంఎల్ఏ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సీసీ రోడ్లు, గోకులాలను ప్రారంభించారు.ఇందులో భాగంగా కవలలగొయ్యి రూ.65లక్షల ఎమ్‌జీఎన్ ఇర్‌జియస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంబించారు. కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, యంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీరాజ్ జేఈ సంపత్ , పంచాయతీ కార్యదర్శులు దాసరి సూరిబాబు, యస్.శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్విమ్మర్ గోలి శ్యామలకు రోటరీ ఐకాన్స్ సత్కారం

వండర్ ఉమన్ శ్యామలకు సన్మానం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లపాటు కఠోర శ్రమతో విశాఖ నుంచి కాకినాడ వరకు 150 కిలోమీటర్ల సముద్రాన్ని 7 రోజుల్లో ఈదగలిగానని వండర్ ఉమన్ గోలి శ్యామల అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సామ్రాజ్య సిల్వర్ కింగ్‌డమ్, శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్ర అభి మీడియా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పాత సోమాలమ్మ గుడివీధిలో గల ఐకాన్ రైజ్ బిల్డింగ్స్ వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్యామలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ తీగల రాజా, అధ్యక్షుడు ఇమ్మణ్ణి వెంకట్, గ్రంధి రాజా, కార్యదర్శి ఉదయగిరి సురేష్, వంశీ, దావూద్, వెంకన్నబాబు, నవీన్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సందడి వచ్చేసింది.. బంధుగణంతో కొత్త కళ తెచ్చేసింది..నగరాల్లో ప్రధాన మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి.. వస్త్ర దుకాణాలు.. నగల దుకాణాలకు జనం భారీగా క్యూకడుతున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పట్టణాల్లో ప్రధాన మార్కెట్లు ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోతున్నాయి..ఇక షాపింగ్ మాల్స్ సంగతి అయితే చెప్పనవసరంలేదు.గత వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉండగా.. పండుగ దగ్గరపడడంతో ఈ రద్దీ పెరిగింది. ఈ చిత్రమే చూడండి..రాజమహేంద్రవరం ప్రధాన మార్కెట్ శనివారమెలా కిక్కిరిసిపోయిందో..!

షాపింగ్..సందడి



సంక్రాంతికి వస్తున్నాం

పల్లెకు పండగొచ్చింది





రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్‌లో బ్యాగ్‌లతో ప్రయాణికులు..

గోదావరి జిల్లాల ఆప్యాయత.. అనురాగాలు.. ప్రేమకు తిరుగులేదు.. కాలం మారినా అదే తీరు.. గోదావరి నీటిలోనే ఆ ప్రేమ ఇమిడి ఉందో ఏమిటో తెలియదు కానీ.. గత పది రోజులుగా ప్రతి ఇంట్లోనూ పండుగకు ఎప్పుడొస్తున్నారు.. ఎప్పుడొస్తున్నారు.. అనే మాటకు అలుపే లేదు.. అంత ఆప్యాయంగా పిలిస్తే ఎందుకురారు.. సంక్రాంతికి వస్తున్నాం.. అంటూ బంధువులు వచ్చేస్తున్నారు.. అటు హైదరాబాద్ ఇటు వైజాగ్ నుంచి దారులన్నీ గోదావరి జిల్లాల వైపే చూపిస్తున్నాయి.. రైళ్లు ఫుల్ అయిపోతున్నాయి.. బస్‌ల సంగతి సరే సరి.. విమానాలదీ అదే పరిస్థితి.. కార్లు.. ద్విచక్ర వాహనాలపై వచ్చే వారి సంఖ్య తక్కువేం లేదు.. రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి.. గోదావరి జిల్లాల్లోని పల్లెలబాట పడుతున్నాయి..

- దారులన్నీ ఇటువైపే
- ప్రధాన నగరాల నుంచి రాక
- తరలివస్తున్న బంధుగణం
- బస్‌లు..రైళ్లు..విమానాలు ఫుల్
- కళకళలాడుతున్న పల్లెలు
- సొంత వాహనాలే ఆధారం
- హైవేలపై ట్రాఫిక్‌జామ్‌లు
- గోదావరి జిల్లాల్లో సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి వచ్చిందంటే గోదావరి జిల్లాల్లో సందడే వేరు.. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కుటుంబాలతో పండుగకు వస్తారు.. పట్టణం నుంచి పల్లెబాట పడతారు.ఉమ్మడి జిల్లాల నుంచి లక్షలాదిమంది బెంగళూరు, పుణే, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే ఎక్కువ. శుక్రవారం పని ముగించుకుని శని, ఆదివారం సెలవు కావడంతో పండుగకు బయలుదేరిపోయారు. శనివారం అర్ధరాత్రి నుంచే గోదావరి జిల్లాల రోడ్లకు తాకిడి పెరిగింది. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, మధురపూడి ఎయిర్‌పోర్ట్ కిటకిటలాడిపోతున్నాయి. ప్రయాణికుల సంఖ్య గతంకంటే పెరిగింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కొద్దినెలల కిందట కేవలం 1300 మంది వరకూ రాకపోకలు సాగిస్తే.. ప్రస్తుతం రోజూ 2 వేలమంది రాకపోకలు సాగిస్తున్నారు. కొద్ది రోజుల కిందట 80 శాతం నుంచి 95 శాతం వరకూ ఆక్యుపెన్సీ ఉండగా ప్రస్తుతం ఫుల్ అయిపోతున్నాయి. ముంబై, ఢిల్లీ నుంచి వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఇక ఆర్టీసీలో సాధారణ రోజుల్లో 25 వేలమంది వరకూ ప్రయాణిస్తుంటే ప్రస్తుతం 50 వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. స్వగ్రామాలకు చేరుతున్న విద్యార్థులు, ప్రజలతో బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. కాకినాడ నగరంతోపాటు రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, జగ్గంపేట, ఏలేశ్వరం, రావులపాలెం బస్టాండ్లలో సందడి కనిపించింది. రైళ్లలో ప్రతి రోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటే.. ఆయా రైల్వే స్టేషన్లన్నీ ఊపిరాడనంతగా కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లకు సంక్రాంతి పండుగ ప్రయాణికుల తాకిడి విపరీతంగా ఉందని చెబుతున్నారు.



రైల్వేస్టేషన్‌లో రద్దీ

200 బస్‌లు ఫుల్..

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. పండుగ ముందు, తర్వాత కూడా వందశాతం బుకింగ్ పూర్తయింది. శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు బస్సులేవీ ఖాళీ లేకపోవడంతో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణీకుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సంక్రాంతి ప్రయాణాలకు ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరికే పరిస్థితి లేకుండాపోయింది. హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు సుమారు 200 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మరిన్ని స్పెషల్స్ నడిపేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే తిరుగు ప్రయాణం కూడా కష్టంగా ఉండబోతుంది. ఈనెల 16 నుంచి 19 వరకు సీటు దొరికే పరిస్థితి లేదు. తిరుగు ప్రయాణాలు చేసుకునే వారికి 20వ తేదీ నుంచి మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయి.

జాతీయ రహదారులు కిటకిట

కార్పొరేషన్(కాకినాడ)/నల్లజర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై సంక్రాంతి సందడి మొదలైంది. వరుస సెలవులు కావడంతో పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు బయలుదేరిన వారితో శుక్ర, శనివారాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. విశాఖపట్నం నుంచి విజయవాడ 16వ నెంబర్ జాతీయరహదారి, కత్తిపూడి నుంచి పామర్రు 216వ నెంబరు హైవేపై వాహనాల రద్దీ కనిపిస్తోంది. ఈ రద్దీ తిరుగు ప్రయాణికులతో ఈనెల 19వ తేదీ వరకు కొనసాగనుంది.

రద్దీ ఎక్కువగా ఉంటే.. స్కూల్ బస్‌లు తిప్పేయండి..



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11: పండుగ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీలు, ఆర్టీసీ డీపీటీవో, డీటీసీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళుతున్న ప్రయాణికులకు సరిపడా బస్సు సౌకర్యాల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటిచోట్ల తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు సరిపోకపోతే ప్రైవేట్ కాలేజీ, స్కూల్ బస్సులను ఉపయోగించాలని సూచించారు.

- డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

పండుగకు రావాలనే.. కంగారొద్దు!

పండుగకు స్వగ్రామాలకు రావాలనే కంగారొద్దు..

జాగ్రత్తగా రండి.. లేదంటే ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.. వచ్చీరాని డ్రైవింగ్‌తో ఇంత రద్దీ సమయంలో దూర ప్రయాణం కష్టమే.. అందుకే ఆలోచించి నిర్ణయం తీసుకోండి.. లేదంటే ప్రమాదాలు జరగొచ్చు..పండుగ నేపథ్యంలో చాలా మంది బెంగళూరు, హైదరాబాద్, పుణె.. తదితర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. ఇలా వచ్చే వారి కారులో తప్పనిసరిగా ఇద్దరు డ్రైవింగ్ వచ్చిన వారు ఉండాల్సిందే.. ఎందుకంటే ఒకరు నిద్రపోయినా మరొకరు డ్రైవింగ్ చేయొచ్చు. లేదా నిద్ర వస్తే రహదారి పక్కన కాసేపు నిలిపివేసి నిద్రపోండి. ఎంత ఆనందంగా వస్తున్నారో అంతే భద్రంగా తిరిగెళ్లాలి సుమా..!

ఒక్క క్షణంలో.. ఘోరం!

- అన్నవరం దైవదర్శనానికి వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు
- కాకినాడ జిల్లా కత్తిపూడి జాతీయ రహదారిపై ఘటన

7



ప్రమాద దృశ్యం

తగ్గేదేలే!

పోలీస్ వర్సెస్ పందెగాళ్లు



- గ్రామాల్లో పందేల బరులు సిద్ధం
- కుదరదంటున్న పోలీస్ శాఖ
- నాయకుల నుంచి గ్రీన్‌సిగ్నల్
- నాలుగు గ్రామాలకో బరి
- ఒక చోట బరి రూ.16 లక్షలు
- గుండాటకు రూ.10 లక్షలు
- ఏర్పాట్లలో నిర్వాహకులు
- మరో పక్క పోలీసుల దాడులు
- ఇంకనూ పట్టువీడని పోలీస్
- భయపడని పందెగాళ్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కోడి.. పోలీస్ దొంగాట మళ్లీ మొదలైంది.. ఒకరు ఆడనివ్వమంటుంటే.. పందెగాళ్లు మాత్రం వారి ఏర్పాట్లలో వారున్నారు.. ప్రజలంతా సంక్రాంతి సందడిలో ఉంటే.. మరో పక్క కోడిపందేల బరులు రూ.లక్షలతో సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ కోడిపందేల బరులు సిద్ధం అయ్యాయి. పోలీసులు ప్రతి ఏటా సంక్రాంతి ఆరంభంలో కోడిపందేలు ఆడనిచ్చేదిలేదని హెచ్చరికలు జారీ చేయడం, తర్వాత నెమ్మదిగా లాఠీలు దించేసి మౌనం వహించడం షరా మామూలే. ఈ ఏడాది కూడా పరిస్థితి అలాగే కనిపిస్తుంది. ఎందుకంటే జిల్లాలో ప్రజాప్రతినిధులు కోడిపందేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.ముఖ్య ప్రజాప్రతినిధులు కార్యకర్తల వరకూ అనుమతులిచ్చి వారు మాత్రం లావాదేవీలకు దూరంగా ఉంటే, ఒక ఎమ్మెల్యే మీఇష్టానుసారం కోడిపందాలు, గుండాటలు ఆడుకోండి..నాది నాకు పంపించండి అంటూ పార్టీ వర్గాలతో చెప్పడం పెద్ద చర్చనీయాంశమైంది.రాజానగరం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో పందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో నాలుగైదు ఊళ్ల ఒక ట్రెండు బరులను సిద్ధం చేస్తున్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని ఒక నియోజకవర్గంలో ఒక గ్రామంలో బరికి రూ.16 లక్షలు వేలం వెళ్లింది. మరో నియోజకవర్గంలో ఒక గ్రామంలో గతంలో మూడు గ్రూపులు విడిపోయి మూడు బరులు వేసిన వారంతా ఒకటై ఒకే బరి వేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ గుండాట పాట రూ.10 లక్షల వరకూ వెళ్లినట్టు తెలిసింది. పోలీసులు, ఇతర అధికారులు కోజ మాంసం అడుగుతున్నట్టు సమాచారం. గతేడాది ఒక బరి నుంచి సుమారు 100 కోజలు ఇచ్చినట్టు కథనం. ఈసారి 150 కోజల వరకూ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. సంక్రాంతి పండుగ రాజకీయ నాయకులు, జూదగాళ్లు, కోడిపందేల నిర్వాహలు, కొందరు పోలీసులకు డబ్బులు తెచ్చేది మారింది. ఆదివారం నుంచి అన్నీ సిద్ధం చేస్తున్నారు.కొందరు ముందుగానే పందేలు ఆరంభించాలనే యోచనలో ఉన్నారు. భోగి రోజు నుంచి ఇక ఎవరి ఇష్టం వారిది.

జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

రాజమహేంద్రవరంసిటీ,జనవరి11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలు, పేకాటలు,గుండాటలు వంటివి నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జిల్లాలో చాలా చోట్ల బరులు ధ్వంసం చేయడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.యువత జూదక్రీడల్లో పట్టుబడితే వారు భవిష్యత్‌లో ఉద్యోగాలు కోల్పోతారని స్పష్టం చేశారు. సంప్రదాయ క్రీడల్లో పాల్గొని కుటుంబంతో ఆనందంగా ఉండాలని హితవు పలికారు.

బరులు ధ్వంసం

తాళ్లపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోడి పందేలు, జూదాల వంటి వాటి జోలికి వెళ్లవద్దని తాళ్లపూడి తహశీల్దార్ బి.రవీంద్రనాథ్, కొవ్వూరు రూరల్ సీఐ విజయ బాబు హెచ్చరించారు. తాళ్లపూడి మండలంలోని కొన్ని గ్రామాల్లో కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరులను ఎస్ఐ రామకృష్ణ ధ్వంసం చేయించారు.

పోలీసుల ఆనందం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పోలీసులకు చెల్లించాల్సిన సరెండర్ లీవ్ బకాయిలు రూ.241 కోట్లు శనివారం సాయంత్రం విడుదల చేసింది.ఈ మేరకు పోలీసులు తమ సంతోషాన్ని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పంచుకున్నారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు విడుదల చేసి సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ముందుగానే సంక్రాంతి పం డుగ తీసుకువచ్చారన్నారు. జీపీఎఫ్‌కు రూ.519 కోట్లు, సీపీఎస్‌కు రూ.300 కోట్లు, టీడీఎస్‌కు రూ.265 కోట్లు ,ఫీజురీఎంబర్స్‌మెంట్‌కు రూ.788 కోట్లు,26 వేల మంది కాంట్రాక్టర్లకు రూ.506 కోట్లు, 651 కంపెనీలకు 90 కోట్ల రాయితీ,విద్యుత్ శాఖకు రూ.500 కోట్లు,ఆరోగ్యశ్రీకి రూ.400 కోట్లు, రైతు కౌలు బకాయిలు రూ.241 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

680 మినీ గోకులాలు నిర్మిస్తాం

- జిల్లాలో ఇప్పటికే 304 నిర్మాణం
- రైతులకు 90శాతం సబ్సిడీ అందజేత
- మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మంచి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో రూ.1.85 లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును మంత్రి దుర్గేష్ కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో రూ.15.59 కోట్లతో 680 మినీ గోకులం నిర్మాణాలు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 304 నిర్మాణాలు పూర్తి చేశామన్నారు.రాష్ట్ర వ్యాప్తగా 12,500 గోకులాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిఠాపురం వేదికగా శుక్రవారం ప్రారంభించారన్నారు. పాడి రైతులకు ఎంతో అవసరమయ్యే గోకులాలను గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం 268 నిర్మిస్తే కూటమి ప్రభుత్వం కేవలం ఆరు నెలల కాలంలోనే 12,500 నిర్మించిందన్నారు. ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పశు సంపదను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత, డ్వామా పీడీ నాగ మల్లేశ్వరరావు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో మినీ గోకులం షెడ్డు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి

సంబరాల సంక్రాంతి





జిల్లాలో సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది.. నాయకులు తమ తమ నియోజకవర్గాల్లో ముందస్తు వేడుకలు చేస్తున్నారు.. మంత్రి దుర్గేష్ శనివారం నిడదవోలు నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ చేయగా.. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు..

క్రీడలతో మానసిక వికాసం: మంత్రి

నిడదవోలులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక వికాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని యువత క్రీడల పట్ల దృష్టి సారించాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో సంక్రాంతి వాలీబాల్ టోర్నమెంటును మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడలైన వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్‌లపై దృష్టి సారించాలన్నారు. త్వరలో నిడదవోలులో మినీ స్టేడియం ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ తిలక్, ఎస్ఐ శోభన్‌కుమార్, పరమహంస, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, సిటీ కేబుల్ ఎండీ నాగేంద్రప్రసాద్, సీపీఎం నాయకుడు రాంబాబు తదితర్లు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ చేయించాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘం నల్లజర్ల మండలాధ్యక్షుడు సత్యం


సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

నల్లజర్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణపత్రాలను ఫిబ్రవరి 28వ తేదీలోపు ఆన్‌లైన్ చేయించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నల్లజర్ల మండలాధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. నల్లజర్ల హైస్కూల్లో శనివారం జరిగిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పింఛన్‌దారుల పాత బకాయిలను దశల వారీగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల ప్రారంభోత్సవం విజయవంతమై రాష్ట్రాభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎం ఆలీసాహెబ్, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఏసురత్నం, ప్రభుదాస్, ప్రతాప్, బాలయ్య, కామేశ్వరరావు పాల్గొన్నారు.

టాటా వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు


ప్లాంట్ యాజమాన్యానికి తనిఖీ లేఖను అందిస్తున్న ఏఎస్‌వో జోడాల

తాళ్లపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మండలంలోని అన్నదేవరపేటలో అరుణజ్యోతి బయో వెంచర్స్ లిమిటెడ్‌కు చెందిన టాటా వాటర్ ప్యాకేజీ యూనిట్ పరిశ్రమకు వార్షిక తనిఖీ లేఖ అందించామని ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి పరిశ్రమకు చెందిన వివరాలు సేకరించి రాష్ట్ర ఆదాయ వనరుల అంచనాలు తయారు చేస్తామని, దానిలో భాగంగా 2023-24 జమా ఖర్చుల వివరాలు, ఆస్తులు, అప్పులు వంటి పరిశ్రమకు సంబంధించిన 9 రకాల వివరాలు సేకరిస్తామన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన కొన్ని పరిశ్రమల్లో టాటా వాటర్ ప్లాంట్ ఒకటి అని ఏఎస్‌వో తెలిపారు.

రైతును పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు కృషి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు.. పలుచోట్ల మినీ గోకులం షెడ్లు ప్రారంభం


పెద్దేవంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైతులను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని నేడు కూటమి ప్రభుత్వంలో ప్రతిరైతును పూర్తిస్థాయిలో ఆదుకునే దిశగా పని చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ప్రక్కిలంక, పెద్దేవం గ్రామాల్లో రైతులకు మంజూరైన గోకులం షెడ్డులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కొక్క షెడ్డుకు రూ.2.30 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, కోట్నీస్, టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, బోడపాటి కాశి, గంగరాజు, కోడి శంకరం, ఎంపీడీవో వెంకటరమణ, డీటీ భారతి, ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన మినీ గోకులం షెడ్డులను ప్రారంభించినట్టు ఏపీవో జేవీ రమణ శనివారం తెలిపారు. ఒక్కో షెడ్డుకు రూ.2.30 లక్షల చొప్పున మండలంలో మొత్తం 24షెడ్డులు మంజూరయ్యాయని నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయని వాటిని ఆయా గ్రామాలకు సంబంధించిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించినట్టు ఏపీవో పేర్కొన్నారు.

దేవరపల్లిలో డ్రోన్‌తో కషాయాల పిచికారీ


డ్రోన్‌తో పిచికారీ విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారి

దేవరపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రకృతి వ్యవసాయాధికారులు డ్రోన్ స్ప్రేయింగ్‌తో తెగుళ్ల నివారణపై ప్రకృతి వ్యవసాయ సాగు విధానాన్ని రైతులకు వివరించారు. దేవరపల్లిలో పిచ్చుకల పల్లేశ్వరరావు పొలం 10 ఎకరాల్లో డ్రోన్ సాయంతో తెగుళ్ల నివారణకు కషాయాలను స్ప్రే చేశామన్నారు. కవల సోమరాజు పొగాకు తోటలో 10ఎకరాల్లో డ్రోన్ స్ప్రేయింగ్ చేశామన్నారు. తక్కువ ఖర్చుతో డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయాధికారులు శ్రీనివాస్,సత్యనారాయణ, ప్రసన్న, సురేఖ, రాధా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


చాగల్లులో గొబ్బెమ్మలు పెట్టి నాట్యం చేస్తున్న చిన్నారులు

చాగల్లు, జనవరి 11, (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రయివేట్ పాఠశాలలు, దేవాలయ ప్రాంగణాలలో రంగవల్లులు వేశారు. స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయ ప్రాంగణంలో అందమైన ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలు పెట్టారు. బాలికలు సంక్రాంతి పాటలు పాడి కోలాట నాట్యం చేశారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్ వీవీ రామారావు విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. చిన్ని కృష్ణుడు, గోపికలు, హరిదాసు వేషధారణలలో చిన్నారులు అలరించారు. చాగల్లులోని కోడ్‌నెంబర్ 64 అంగన్‌వాడి కేంద్రంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.

రైలు నుంచి జారిపడి

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చాగల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చాగల్లు రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న డ్రైనేజీ వద్ద శనివారం పోలీసులు గుర్తు తెలియని మృతదేహాలు గుర్తించారు. ఎస్ఐ కె.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. జమాల్పూర్ జంక్షన్ నుంచి సికింద్రాబాద్ వెళుతున్న రైలు నుంచి సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసున్న గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని రైల్వేస్టేషన్ అధికారులు తెలియజేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

కోడిపందేలు నిర్వహిస్తే

కఠిన చర్యలు : తహశీల్దార్

చాగల్లు, జనవరి 11, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాయని తహశీల్దార్ ఎం.మెరికమ్మ హెచ్చరించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో హైకోర్టు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ పేరుతో కోడిపందాలు, పేకాటక్లబ్బులు, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు, సచివాలయ సిబ్బంది లేదా రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

వేంకటేశ్వరుడికి పూజలు

దేవరపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా దేవరపల్లిలోని శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుప్రభాతసేవ జరిపారు. కూడారై ఉత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి

- పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్
- విజ్జేశ్వరంలో పల్లె పండుగ
- పలు పాఠశాలల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలు


విజ్జేశ్వరంలో ఎద్దుల బండి నడుపుతున్న మంత్రి దుర్గేష్, పక్కనే కలెక్టర్

నిడదవోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు అని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే పల్లె పండుగ అని, ఎక్కడెక్కడి వారో స్వగ్రామాలకు చేరుకుని తమవారందరితో పండుగను ఘనంగా చేసుకుంటారన్నారు.అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొని గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌తో కలసి భోగి మంటలు వెలిగించారు. గ్రామంలో జరిగిన ముగ్గుల పోటీలను తిలకించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

నిడదవోలులో ముగ్గుల పోటీలు.. నిడదవోలులోని గాంధీనగర్‌లో స్ప్రింగ్ బోర్డు స్కూల్, రోటరీ సెంట్రల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ సంక్రాంతి అందమైన రంగవల్లులకు ప్రతీక అని, మహిళల్లోని సృజనాత్మకతకు ఈ ముగ్గుల పోటీలు అద్దం పడతాయన్నారు. పోటీల్లో పి.మేరీరత్నం, ఎల్.మౌన్యశ్రీ, వై.సదాలక్ష్మి, కె.శిరీష మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు కొండేపాటి రామకృష్ణ, జీవీఎన్ కృష్ణారావు, కంఠమని గోపాలకృష్ణ, బీఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు పట్టణ, మండలంలో సంక్రాంతి ముందస్తు సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీఅభ్యాస పాఠశాలలో సంక్రాంతి సంబరాలను టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి ప్రారంభించారు. రంగవల్లులు, బొమ్మల కొలువులు ఏర్పాటుచేశారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. అనంతరం భోగి మంటలు వెలిగించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు పాలడుగుల వెంకటరమణ, భార్గవి, పాలడుగుల రఘురామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కొవ్వూరు అభ్యాసలో భోగి దండలు వేస్తున్న సుబ్బరాయచౌదరి

దేవరపల్లి: సంస్కృతి సంప్రదాయాలను తెలిపేందుకు ముగ్గుల పోటీలు ఎంతో దోహద పడతాయని కళాశాల చైర్మన్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లిలో బీహెచ్ ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో, ఆనంద్ ఎడ్యుకేషన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం రంగవల్లులు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలను కళాశాల చైర్మన్ సువర్ణరాజు ప్రారంభించారు. క్రీడల్లో, ముగ్గుల పోటీల్లోని విజేతలకు కళాశాల తరపున కోకో కోలా కంపెనీ వారు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, జూనియర్ కళాశాల ఏవో ఆనంద్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ విక్రమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో రంగవల్లులు పరిశీలిస్తున్న సువర్ణరాజు

యువత క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- వేళ్లచింతలగూడెంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు


క్రీడాకారిణులతో ఎమ్మెల్యే మద్దిపాటి తదితరులు

గోపాలపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యువత విద్యతో పాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేళ్లచింతలగూడెంలో ఆర్అండ్ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ,ఎమ్మెల్యే మద్దిపాటి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ఎమ్మెల్యే మద్దిపాటి కరచాలనం చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 9 పురుషుల జట్లు, 10మ హిళా జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. పురుషులకు సంబంధించి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు, మహిళలకు సంబంధించి ఇండియన్ రైల్వే బ్లూఏ, ఇండియన్ రైల్వే ఆరెంజ్‌బీ, ఆంధ్ర ప్రదేశ్ ఏ, తెలంగాణ ఏ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ బీ, చైనీస్, ఛత్తీస్‌ఘడ్ ఏ, హరియాణా బీ, కర్ణాటక రాష్ట్రాలకు జట్లు పాల్గొంటాయన్నారు. శనివారం పురుషుల విభాగం నుంచి నెల్లూరు, ప్రకాశం జట్లు బరిలో దిగాయి. కార్యక్రమంలో సీఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్ఐ కె.సతీష్‌కు మార్, కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి, పిన్నమనేని చిన బాబు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- కానూరు జడ్పీ హైస్కూల్ 1980-85 బ్యాచ్ విద్యార్థులు
- కొవ్వూరు ఏఎస్ఆర్ బీఈడీ కాలేజీ 2003-04 ఫస్ట్ బ్యాచ్


పెరవలి: కానూరు జడ్పీ హైస్కూల్ 1980-85 బ్యాచ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెరవలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కానూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కానూరులో నిర్వహించారు. కానూరు హైస్కూల్ 1980-85 బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు ఈడ్పు గంటి సుబ్బారావు, భమిడిపాటి సుబ్బారావు, పెదపూడి నారాయణలతో పాటు పూర్వవిద్యార్థి, ప్రస్తుత హెచ్ఎం చోడపనీడి రామాంజనేయులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు ముళ్లపూడి రాజేంద్రప్రసాద్, వీరమళ్ల శ్రీనివాస్, కరుటూరి రామ్మోహనరావు, (పంచాయతీరాజ్ డీఈ, నిడదవోలు), నిమ్మల శ్రీనివాస్, రామడుగుల సూర్యనారాయణ, బావన కృష్ణమూర్తి, పాలా మునీశ్వరరావు, బొండాడ విశాలాక్షి, టీవీ జానకిరాణి, అనపర్తి సీతారత్నంలను పలువురు అభినందించారు.

కొవ్వూరు: కొవ్వూరు ఆకుల శ్రీరాములు బీఈడీ కళాశాలలో 2003-04 ఫస్ట్ బ్యాచ్ విద్యార్థులు 20 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి మధురానుభూతులు, అల్లరి చేష్టలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ గ్రూపు విద్యా సంస్థల అధినేత ఆకుల రమాదేవి, పూర్వ ప్రిన్సిపాల్, ప్రస్తుత నన్నయ యూనివర్శిటీ ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, సీఈవో రాజశేఖర్, అప్పటి ఉపాధ్యాయులు రాంబాబు, బ్రహ్మాజీ, ఆకుల వెంకటరత్నం, పెరవలి ఎంపీపీ కాశ్శర్ల ప్రసాద్, ప్రస్తుత ప్రిన్సిపాల్ కోటేశ్వరి, రిటైర్డ్ సీఐ రామచంద్రరావు పాల్గొన్నారు.


కొవ్వూరు ఏఎస్ఆర్ బీఈడీ కాలేజీ 2003-04 ఫస్ట్ బ్యాచ్ విద్యార్థులు

టిడ్కో ఇళ్లలో గుప్పుమన్న గంజాయి

- నిడదవోలులో 22 కిలోలు స్వాధీనం
- 11 మంది యువకుల అరెస్టు


గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిడదవోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో రూ.1.10 లక్షల విలువైన 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 11 మంది యువకులను అరెస్ట్ చేసినట్టు సీఐ పీవీజీ తిలక్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పట్టణ శివారు తీరుగూడెం ప్రాంతంలోని టిడ్కో ఇళ్ల వద్ద గంజాయి విక్రయాలు సాగుతున్నాయనే సమాచారంతో దాడి చేసి 11 మంది యువకులను అరెస్ట్ చేసి 22 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజుపేటకు చెందిన డొంకా ప్రవీణ్‌కుమార్, రైల్వే క్వాటర్ సమీపంలో నివాసముండే ఆముదాల రవి, దేవరపల్లికి చెందిన కొప్పాక అఖిల్‌కుమార్, పల్లంట్లకు చెందిన దొండపాటి గంగాధర్, నిడదవోలు మండలం కంసాలిపాలేనికి చెందిన ఎలిచర్ల మిథున్‌దాస్, నిడదవోలుకు చెందిన కాకి పవన్, మజ్జి భానుప్రకాష్, కాకరపర్తి మహేష్, విశాఖ జిల్లాకు చెందిన కోరా రామచంద్రరావు, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గోపీ గోలారి తదితరులను అరెస్ట్ చేశామని సీఐ పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పూర్తిస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించామని, అందులో భాగంగానే ఈ దాడి నిర్వహించామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు పి.శోభన్‌కుమార్, పరమహంస తదితరులు పాల్గొన్నారు.

కేలా..డీలా

అరటి ధర పతనం.. రైతుల్లో ఆందోళన

సంక్రాంతికైనా పెరుగుతుందని ఆశ

2500 ఎకరాల్లో అరటి సాగు

ఉండ్రాజవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అరటి ధర పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలలుగా అరటి ధర పడిపోయి మార్కెట్ డీలా పడడంతో రైతులు పెట్టుబడులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 2500 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. తాడిపర్రు, వెలగదుర్రు, మోర్త, ఉండ్రాజవరం, సత్యవాడ, దమ్మెన్ను, కాల్దరి, చివటం తదితర గ్రామాల్లో అరటి సాగు చేస్తున్నారు. అక్టోబరు నెల నుంచి అరటి ధర అంతంతమాత్రంగానే ఉంది. కార్తీక మాసంలో రేటు బాగుంటుందని ఆశపడిన రైతులకు మార్కెట్‌లో రేటే లేక పోవడంతో నిరుత్సాహం చెందారు. పండిన అరటి పంటను ఎంతో వ్యయప్రయాసాలకు ఓర్చి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అయితే గెలలకు గిట్టుబాటు ధర ఉండకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. మండలం నుంచి అరటి ఎగుమతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని మోర్త గ్రామానికి చెందిన రైతు ఎస్.సుబ్బారావు పేర్కొన్నారు. అరటి సాగుకు ఎకరాకు సుమారు రూ.1.30 లక్షలు నుంచి రూ.1.50లక్షలు వరకు పెట్టుబడి అవుతోందని చెప్పారు. రైతులు అరటి గెలలను తణుకు మార్కెట్‌కు తరలిస్తారు. మార్కెట్‌లో ప్రస్తుతం అరటి కర్పూర గెల రూ.100కు కొనుగోలు చేస్తున్నారు. ఈ రేటుతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని చివటం గ్రామానికి చెందిన రైతు మన్నె వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి, శివరాత్రి వంటి పండుగ సమయాల్లోనైనా రేటు పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


ఉండ్రాజవరంలో సాగులో ఉన్న అరటి తోట

అనుమతుల్లేని ఆసుపత్రులపై

కఠిన చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య



తాళ్లపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని, అర్హతలు లేని సిబ్బందితో నడిపే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జె.సంధ్య అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆమె శనివారం తాళ్లపూడిలోని పలు ఆసుపత్రులను సందర్శించినట్టు చెప్పారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నిషేధమని, వాటి నిర్వహణపై తనిఖీ చేస్తున్నామన్నారు. కాగా పలు ఆసుపత్రుల్లో లోపాలు గుర్తించి వారికి సూచనలు చేశామన్నారు.

వజ్రవనిత వాసవి క్లబ్

అధ్యక్షురాలిగా నాగమణి


వజ్రవనిత వాసవిక్లబ్ కార్యకవర్గ ఎన్నిక

కొవ్వూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు వజ్రవనిత వాసవిక్లబ్ అధ్యక్షురాలిగా మద్దుల నాగమణి నియమితులయ్యారు. కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం వజ్రవనిత వాసవిక్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా నాగమణి, కార్యదర్శిగా తటవర్తి రాజేశ్వరి, కోశాధికారిగా కక్కిరాల కృష్ణవేణి, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఎంవీవీ వరప్రసాద్, బంగారు కాశీ అన్నపూర్ణ, కొల్లేపర శ్రీనివాస్, ఉప్పల శ్రీవల్లి గ్రంధి ప్రవీణ్, తుమ్మలపల్లి రమేష్, వలివేటి రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫ రాకు

అంతరాయం

తాళ్లపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో మలకపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎన్.నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మలకపల్లి, పెద్దేవం, రావూరుపాడు, తిరుగుడుమెట్ట, ధర్మవరం, పెనకనమెట్ట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

మానవత సాయం

నల్లజర్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మానవత సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందించారు. చీపురుగూడెంలో కొరపాటి వెంకటేశ్వరరావు, జవ్వాది నాగలక్ష్మి, నల్లజర్లలో బోడ సుబ్బాలక్ష్మికి, షేక్ షబీనాకు ఆర్థిక సాయం అందజేసినట్టు సంస్థ బాధ్యులు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	: ముఫాస
వై.స్క్రీన్2	: క్రావెన్ ధ హంటర్, మార్కో
దేవిశ్రీ (గాయత్రి	:
అనన్య	: పుష్ప-2

నిడదవోలు

వీ మ్యాక్స్	: గేమ్ ఛేంజర్
రాధాకృష్ణ	: ముఫాసా
శ్రీగణపతి	: డాకూ మహరాజ్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2
త్రినాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2